# 1. బతుకు తనఖా

కొత్తగా కట్టిన ఆ రంగుల భవనం పట్టపగలు పెద్ద పెద్ద ట్యూబులైట్ల వెలుతురుతోనూ, ఫ్యానుల చప్పుడుతోనూ కొత్తగా లోపలకు అడుగుపెట్టే వాళ్ళకు భయం కలిగించేలా ఉంది.

వెంకటేశ్వర్లు బిడియపడుతూనే లోపలకు అడుగు పెట్టాడు.

లోపల ఎక్కువ జనం లేరు. అక్కడ కుర్చీలలో కూర్చున్నవాళ్ళు పుస్తకాలు చదువుకుంటూనూ, రాజకీయాలు మాట్లాడుకుంటూనూ కాలక్షేపం కోసం వచ్చిన వాళ్ళమాదిరిగా ఉన్నారు.

వెంకటేశ్వర్లు రాకను చూసి, ఎదురుగా ఉన్న ఆయన ఏం కావాలన్నట్లు నొసలు చిట్లించాడు.

"మరీ... మరీ... ఎద్దులకి ఋణాలు ఇస్తున్నారంట..." వెంకటేశ్వర్లు మాట పూర్తిచేయలేదు.

"అదుగో, లోపల కూర్చుని ఉంటాడు. పోయి ఆయన్నడుగు"

వెంకటేశ్వర్లు లోపలకు దారితీసాడు.

అక్కడ కుర్చీలో ఒక చిన్నపాటి గున్న ఏనుగు మాదిరిగా ఉన్నతను కూర్చుని ఏదో రాసుకుంటున్నాడు.

"నమస్తండీ..." వెంకటేశ్వర్లు రెండు చేతులూ ఎత్తి చెప్పాడు.

ఆయన తల ఎత ఎత్తిచూసి, ఏం మాట్లాడకుండా ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చోఅన్నట్లుగా సైగచేసి, మళ్ళీ తన రాతలో పడ్డాడు.

వెంకటేశ్వర్లు కూర్చున్నాడు.

కొద్దిసేపు గడిచిన తరువాత ఆయన పుస్తకం మూసివేస్తూ, "ఏం కావాలి?" అని అడిగాడు.

"ఎద్దులకి రుణాలు ఇస్తున్నారంట కదండీ?"

"ఏ ఊరు మీది?"

చెప్పాడు వెంకటేశ్వర్లు.

"పొలం ఎంతుంది నీకూ?"

"రెండెకరాలు ఉందండీ"

"సరే, లోన్లు ఇప్పుడీయటం లేదు. ఇంకొంచెం టైముపట్టిద్ది. పదిహేను రోజులు ఆగి కనపడు"

"మీరు ఖాయంగా ఇస్తారండీ?"

"ఇస్తాం లేవయ్యా! ఇవ్వటానికి కదూ ఇక్కడ మేముందీ?"

"వస్తానండీ" అంటూ వెంకటేశ్వర్లు లేచి వచ్చాడు.

వెంకటేశ్వర్లు ఒక సన్నకారు రైతు. రెండు ఎకరాలు పొలం ఉంది. మంచి కష్టజీవి.

వెంకటేశ్వర్లుకు ఎద్దులు కొనుక్కుని బాడుగ సేద్యం చేయాలని ఎంతో కోరికగా ఉంది. బాడుగ సేద్యం మీద ఏడాదికి నాలుగయిదు వేలు సంపాదించుకోవచ్చు.

ఒకరికి కూలికి పోకుండా, కూలి కోసం వెదుకులాడుకోకుండా పొట్ట జరుగుతుంది ఎద్దులమీద.

సంవత్సరం నుంచీ కోరిక అయితే ఉంది కానీ, పెట్టుబడిలేదని ఆగాడు. ఇప్పుడు బ్యాంకు వాళ్ళు ఎద్దులకూ, టైరు బండికీ లోన్లు ఇస్తున్నారని తెలుసుకుని ఎగిరి గంతేశాడు.

బ్యాంకు మేనేజర్ పదిహేను రోజుల తరువాత రమ్మనటంతో వెంకటేశ్వర్లు తనకి లోన్ వచ్చినట్టే సంతోషపడిపోయాడు.

ఆయన చెప్పిన గడువుకి వెంకటేశ్వర్లు బ్యాంకు దగ్గర హాజరయ్యాడు.

"మాకు ఇంకా పైనుంచి ఆర్డర్లు రాలేదు. వచ్చేనెల మొదటివారంలో కనపడు" అన్నాడు మేనేజర్.

వచ్చే నెల వచ్చింది.

వెంకటేశ్వర్లు మళ్ళీ ప్రయాణం కట్టి బ్యాంకు దగ్గర ప్రత్యక్షమయ్యాడు.

"ఏ ఊరు మీది?" మళ్ళీ అడిగాడు మేనేజర్.

చెప్పాడు వెంకటేశ్వర్లు.

"సరే, నీకిప్పుడు ఎద్దులూ, బండికి లోన్ కావాలంటావ్?"

"బండి లేకపోయినా పర్లేదు కానీ, ప్రస్తుతానికి ఎద్దులు ఇప్పించండి చాలు!"

"ఒకటెలా ఇస్తాం! రెంటికీ కలిపే లోన్ ఇచ్చేది. లోన్ మొత్తం ఎనిమిది వేలు. మాకు మామూలు అందులో వందకి పదిరూపాయలివ్వాలి"

"మామూలేందదండీ?" వెంకటేశ్వర్లు మనసులో రాయిపడింది.

"అదంతేనయ్యా! నువ్వొక్కడివే కాదు ఇచ్చేది. మా బేంకీలో లోన్ తీసుకున్నోళ్ళు ఎవరైనా మాకు మామూళ్ళు ఇస్తేనే లోన్ శాంక్షన్ అయ్యేది. నీ కంత అనుమానం అయితే, బైట రైతులున్నారు. వాళ్ళని పోయి కనుక్కో!"

"కనుక్కునేది ఎందుకులెండి. మీరు నాకబద్ధం చెబుతారా?"

"అసలు నువ్వు ఎద్దులూ, బండీ కొనుక్కోకపోయినా పర్లేదు. అవి కొన్నట్లు రాసుకుని లోన్ డబ్బులు నీకిస్తాం. ఆ డబ్బులు నీ ఇష్టం వచ్చినట్లు చేసుకోవచ్చు."

"నా కెందుకండీ డబ్బులు? ఎద్దులూ, బండీ కోసమేనండీ ఋణం"

"ఎద్దుల కోసమనీ, బర్రెల కోసమనీ, గొర్రెల కోసమనీ లోన్లు తీసుకుని, ఆ డబ్బులు వేరే అవసరాలకు వాడుకునే వాళ్ళు ఎంతమంది లేరూ? అయినా నువ్వేం మాకు ఊరకియ్యటం లేదుగా డబ్బులు. ఇందులో ఏ మాత్రం బెడిసినా మా ఉద్యోగాలూడిపోతాయి."

"కానియ్యండి సామీ! అంతా మీ ఇష్టం"

"విషయం చెబుతున్నా! ఈ డబ్బులు కూడా నువ్వు ఒక్కసారి కాదు కట్టేది. ఐదేళ్ళు ఐదు కాస్తులు కట్టుకుంటే సరి పోయిద్ది. ఏమంటావు?"

"నేననేది ఏముందండీ?"

"సరే, అక్కడకుపోయి, యాభై రూపాయలు కట్టి పాసు పుస్తకం తీసుకో. అప్లికేషన్ ఫారాలు ఇవిగో. ఇవి పూర్తి చేసుకుని వారం రోజులకు తీసుకురా!" మేనేజర్ అన్నాడు.

వెంకటేశ్వర్లు యాభై రూపాయలు కట్టి పాస్ పుస్తకం, అప్లికేషన్ ఫారాలూ తీసుకుని ఇంటికి వచ్చాడు.

ఇక అప్పటి నుంచీ బ్యాంకు చుట్టూ ప్రదక్షిణలు మొదలు పెట్టాడు.

తన పొలం మీద ఏ బ్యాంకులోనూ ఋణం తీసుకోలేదని రిజిస్ట్రార్ ఆఫీసు నుంచి సర్టిఫికెట్ తీసుకురమ్మన్నారు. పొలం ఉన్నవాళ్ళే హామీలు

ఉండాలనీ, ఆ హామీల్ని తెచ్చుకోమన్నారు. మండలాధికారి సిఫార్సు చేయాలన్నారు. ఊళ్ళో సర్పంచ్ సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు.

ఇలా ఏదో ఏదో వంకతో బ్యాంకు చుట్టూ తిప్పించుకుంటున్నారు.

పోయిన ప్రతిసారీ వాళ్ళకి కాఫీలూ, టీలూ, టిఫిన్‌లూ, తన తిరుగుడు ఖర్చూ!

పోయివస్తే చాలు ఇరవై రూపాయలు వదులుతున్నాయి.

ఇంటిదగ్గర తనకి రోజుకూలి పన్నెండు రూపాయలు పోతున్నాయి.

తను పనికిపోయే రైతు నారాయణ దగ్గర ఐదు వందల రూపాయలు అప్పు తీసుకున్నాడు. లోన్‌కోసం ప్రయత్నాలు మొదలు పెట్టినప్పుడు ఏ అవసరం వస్తుందో అని ముందుగా తీసుకుని పెట్టాడు.

వెంకటేశ్వర్లు పాపం పాతికసార్లు బ్యాంకుచుట్టూ గిరికీలు కొట్టాడు.

ఐదు వందల రూపాయలు ఖర్చు అయిపోయాయి.

నారాయణ దగ్గర అప్పు మిగిలింది.

"వ్యవసాయ అభివృద్ధి బ్యాంకు అని కాదురా దీనికి పేరు ఉండాల్సింది, వ్యవసాయ దివాలకోరు బ్యాంకు అంటే బాగుండేది." అని బ్యాంకు దగ్గరకు వచ్చే రైతు యువకులు నవ్వుతూ ఎగతాళిగా అనుకోవటం వెంకటేశ్వర్లు చాలాసార్లు విన్నాడు.

ఇంతకుముందు ఈ బ్యాంకికి భూమి తనఖా బ్యాంకు అని పేరుండేది. ల్యాండ్ మార్టగేజ్ బ్యాంకు కాదు, లైఫ్ మార్ట్‌గేజ్ బ్యాంకు అని అప్పుడు జనం అనుకునే వాళ్ళు.

లోన్ కోసం డబ్బు ఇలా ఖర్చు పెట్టుకుంటూ, కుక్క మాదిరిగా వీళ్ళచుట్టూ తిరగటం కంటే కూలిచేసుకోవటమే మంచి దనిపించింది వెంకటేశ్వర్లుకి. కానీ, లోన్ వస్తుంది, బాదుగ మీద సంపాయించుకుందామని ఆశ!

వెంకటేశ్వర్లు మంచి పనివాడు. సేద్యంలో అతనంత చక్కగా, నైపుణ్యంగా, అందంగా ఎవరూ చేయలేరని పేరు.

పొరుగూరులో ఒకసారి సేద్యంలో పోటీలు పెట్టారు. ఎవరు చక్కగా 'కోంద్ర' వేస్తారో వాళ్ళకి నూటపదహార్లు బహుమానం.

ఆ పోటీలో వెంకటేశ్వర్లుకి మొదటి బహుమతి వచ్చింది.

పదిఎకరాలు పొలంలో అంగుళం వంకర లేకుండా మహాచక్కగా 'కోంద్ర' వేశాడు.

అతను జీతాలకు ఉండేటప్పుడు ఇతర జీతగాళ్ళు అందరికంటే కూడా రెండు వందల రూపాయలు ఎక్కువ జీతం ఇతనికి ఇవ్వాల్సిందే!

వెంకటేశ్వర్లుని జీతానికి పెట్టుకునే దగ్గర రైతుల మధ్యపోటీ ఉండేది. నారాయణకాపు ఎక్కువ జీతం ఇచ్చి పెట్టుకునేవాడు.

రెండేళ్ళ క్రితం నెమ్ము జబ్బువచ్చి ఆరోగ్యం దెబ్బతిన్నది. అప్పటి నుంచీ జీతం మానుకున్నాడు. తనకి ఉన్న పొలం రెండెకరాలులో పంట పండించుకుంటూ, కూలికి పోతూ కుటుంబాన్ని జరుపుకుంటున్నాడు.

మందులు తినటంతో నెమ్ము జబ్బు తగ్గిపోయింది.

ఇప్పుడు సొంతంగా ఎద్దులు కొనుక్కొని బాడుగలు చేసుకుంటూ నాలుగు రూపాయలు సంపాయించుకుందామనే కోరిక కలిగింది.

ఎట్టకేలకు ఓ శుభముహూర్తాన వెంకటేశ్వర్లుకి లోన్ శాంక్షన్ అయింది.

లోన్ మొత్తం ఎనిమిది వేలు.

మార్జిన్ మనీ అని వెయ్యికి వంద రూపాయలు కట్టాలని చెప్పారు.

లోన్ తీసుకున్న తరువాత ఇస్తానని చేబదులుగా నారాయణ కాపు దగ్గర తీసుకొచ్చిన డబ్బులు మార్జిన్ మనీకి కట్టాడు.

వాళ్ళ మామూలు ఎనిమిది వందలు తీసుకున్నారు.

ఈసీల కోసం రిజిస్ట్రార్ ఆఫీసులో లంచం, మండలాధికారి సిఫార్సు కోసం తిరిగినందుకూ నాలుగు వందలు వదిలాయి.

లోన్‌కోసం తెచ్చిన అప్పులూ, మామూళ్ళూ, అన్నీపోగా వెంకటేశ్వర్లు చేతికి నికరంగా అయిదున్నర వెయ్యి మిగిలాయి.

పొరుగు ఊళ్ళో ఒక రైతు మంచి టైరుబండి అమ్ముతున్నాడని తెల్సుకుని వెంకటేశ్వర్లు ఆ బండిని కొనుగోలు చేశాడు.

ఐదువేలు అయింది బండి.

ఇక ఎద్దులు కావాలి.

వెంకటేశ్వర్లు చేతిలో ఐదు వందలు మిగిలాయి.

ఎద్దులు లేని బండి ఎందుకు? ఎద్దులు కొనాలంటే డబ్బు కావాలి.

నారాయణ కాపు దగ్గరకు వెళ్ళక తప్పలేదు.

"చెబితే వినుకోవు. నీ మతమే మతంరా ఎంకటేశులూ... ఎందుకొచ్చిన దావు? జీతానికుంటే ఏడాదికి నాలుగేలొస్తాయి కదా!"

"చెప్పిన మాటే కద బాబా అదంతా! ఎట్టయినా నువ్వు మూడేలు చూసియ్యవే! నేను ఎద్దులు తెచ్చుకుంటాను!"

"నేను దబ్బిస్తాను. సరే, నా అప్పు బేంకోళ్ళ అప్పు ఈ అప్పంతా ఎట్ట తీరుస్తావ్?"

"బాడుగలు దొరకాలి కానీ... ఈ అప్పేం లెక్క? రెండు మూడేళ్ళకల్లా అంతా తీర్చెయ్యనూ..."

"నువ్విప్పుడు మంచి వేడిమీదున్నావ్? చెబితే వినిపించుకునేటట్లు లేవు. నా దగ్గర మాత్రం డబ్బు లేదు. శెట్టి దగ్గర తీసుకుని ఇయ్యమంటే ఇస్తా. మూడు రూపాయల వడ్డీ కంటే తక్కువియ్యడు శెట్టి!"

"సరే, తీసుకుని ఇయ్యే బాబా! తొందరగా పనిచేసి పెట్టు, మూడు నాల్రోజుల్లో తెచ్చుకుంటా ఎద్దులు. మళ్ళీ అదునుపోయిద్ది."

"రేపు పొద్దునే తెచ్చి పెడతాలేరా!" అని చెప్పాడు నారాయణ.

వెంకటేశ్వర్లు సంతోషంగా ఇంటిదారి పట్టాడు.

మరుసటి రోజే డబ్బు తీసుకుని ఎద్దుల కోసం తిరిగి తిరిగి, తనకి నచ్చిన జతని కొనుక్కొచ్చాడు.

వెంకటేశ్వర్లు చిరకాలపు కోరిక నెరవేరింది.

సేద్యం మొదలు పెట్టాడు.

మొదటి సంవత్సరం గడిచిపోయింది. ఆదాయం పర్లేదు. బ్యాంకులో అప్పు తీర్చలేకపోయినా, బైట తెచ్చిన అప్పు సగానికంటే ఎక్కువ తీర్చాడు.

రెండో సంవత్సరం గడిచింది. బయట అప్పు అంతా తీర్చాడు.

మూడో ఏడు వచ్చింది.

వెంకటేశ్వర్లు కొంత పొలం కౌలుకి కూడా తీసుకుని పంట వేశాడు.

బాగా నష్టం వచ్చింది. పంట నష్టంతోపాటు, ఎద్దులకు మేతలేక, మేత కొనుక్కొచ్చి కొత్తగా అప్పు కూడా చేయాల్సి వచ్చింది."

బ్యాంకు వాళ్ళు జీపు వేసుకుని జోరుగా తిరిగి పోతున్నారు. నోటీసుల మీద నోటీసులు ఇస్తున్నారు.

వెంకటేశ్వర్లు వాళ్ళకి రెండొందలు మామూలు సమర్పించి, ఆ యేటికి అప్పు అడగవద్దని, కాళ్ళావేళ్ళా పడి బ్రతిమలాడాడు.

రెండొందలు ఒక రోజు రాత్రికి మందు ఖర్చుకి వచ్చినట్లే అని బ్యాంకు వాళ్ళు ఆ యేటికి ఊరుకున్నారు.

నాలుగోయేడు వెంకటేశ్వర్లుకి మళ్ళీ నష్టాలు.

ఆయన పని కుడితిలో పడిన ఎలుక మాదిరిగా తయారయ్యింది.

బ్యాంకు వాళ్ళు ఖచ్చితంగా కట్టి తీరాలన్నారు. డబ్బు కట్టకపోతే ఇంట్లో ఉన్న చెంబూ, తపేళా బైట పడేసి జప్తు చేస్తామన్నారు.

వరుసగా నాలుగు వాయిదాల డబ్బు కట్టాలి.

ఈ నాలుగు వాయిదాలతోపాటు – అప్పటినుంచీ ఇప్పటి వరకూ...
వడ్డీల పైన వడ్డీలు!
చక్రవడ్డీలు!
తడిసి మోపడైంది!
వెంకటేశ్వర్లుకి దిక్కుతోచలేదు.
ఊళ్ళో వ్యవసాయంలో అందరికి నష్టమే! ఆ ఊరు మొత్తం మీద రూపాయి అప్పు కూడా దొరకటం గగనమే!
బ్యాంకు వాళ్ళు ఊరుకునేటట్లు లేరు. ఈ సారి లంచానికి కూడా లొంగం అని తేల్చి చెప్పేశారు.
వెంకటేశ్వర్లు ఆలోచించాడు.
మార్గం ఏమీ కనపడలేదు. గతిలేని స్థితిలో ఎద్దులూ, బండీ బేరానికి పెట్టాడు.
ఏ బేరగాడు వచ్చినా, తను కొన్న రేటులో సగానికి అడుగుతున్నాడు.
ఎంతో కొంత అని చివరకు ఆరువేలు చేసి ఎద్దులూ, బండిని తెగనమ్మాడు. ఆ డబ్బు బ్యాంకు దగ్గరకు తీసుకుపోతేమూడు వాయిదాలకే సరిపోలేదు.
వెంకటేశ్వర్లు దిగులుతో బస్సెక్కాడు.
సేద్యం పెట్టాలనుకున్నప్పుడు ఎంత ఉత్సాహంగా, సంతోషంగా, ఆశగా బ్యాంకు దగ్గరకు వెళ్లాడో, ఇప్పుడు,అంతే నిరుత్సాహంగా, నిరాశగా, బాధగా ఇంటికి వచ్చాడు.
రెండు వాయిదాల అప్పు తను ఎలా తీర్చాలి.
వడ్డీతో వడగళ్ళ గుర్రం కూడా పరిగెత్తలేదట! ఉండేకొద్దీ వడ్డీ పెరగటం తప్ప తగ్గదుకదా!
అప్పు పెద్దదయితే తను అసలు కూడా తీర్చలేడు!
ఎందుకొచ్చిన బాధ, ఆ అప్పేదో తీర్చేస్తే దిగులూ, విచారమూ ఉండదు! కలో, గంజో తాగి బతకొచ్చు!
ఒక ఎకరం పొలం అమ్మాల్సిందే!
అంతగా పొలం డబ్బు కొద్దిగా మిగిలితే దాచి పెట్టుకోవచ్చు!
వెంకటేశ్వర్లు తనకి ఉన్న రెండెకరాలు పొలంలో ఒక ఎకరం బేరానికి పెట్టాడు.
తరువాత నారాయణ కాపుదగ్గరే, ఊళ్ళో అందరి జీతగాళ్ళ కంటే ఎక్కువ జీతంతో తిరిగి జీతగాడుగా కుదిరాడు వెంకటేశ్వర్లు.

ఆదివారం విశాలాంధ్ర – 13 మార్చి, 1988